సాక్షి తిరుపతి

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

సకల దేవతలకు ఆహ్వానం

ఆగమోక్తంగా ముక్కంటీశుడి ధ్వజారోహణం

- రాత్రి వెండి అంబారీపై ఊరేగిన పార్వతీ పరమేశ్వర్లు
- శివనామస్మరణతో మార్మోగిన శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ భక్తుల శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం మంత్ర జలాలను ఆలయంలో చల్లుతూ శుద్ధి చేశారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లు వెండి అంబారీ వాహనంపై ఆశీనులయ్యారు. వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి శివయ్యగోపురం, రాజగోపురం మీదుగా దేవాంగుల మండపం వద్దకు తీసుకొచ్చారు. పంచమూర్తులు చతుర్మాఢ వీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. తర్వాత స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. అలాగే ఉమాదేవి సమేత చంద్రశేఖర స్వామి త్రిశూలానికి ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.


వెండి అంబారీపై శివపార్వతుల పుర విహారం

చుట్టాలకు ఆహ్వానం

సాయంత్రం ఆలయంలోని యాగశాలలో కలశ స్థాపనతో విశేష పూజలు చేశారు. చతుర్మాఢ వీధుల్లో వెలసిన నవ సంధి వినాయకుల వద్ద ఆగి మంత్రోచ్చరణలతో చుట్టాలను శివపార్వతుల కల్యాణానికి విచ్చేయాలంటూ క్షేత్రధర్మంగా అర్చకులు ఆహ్వానం పలికారు.

దేవరాత్రి ఉత్సవం

శనివారం రాత్రి జరిగిన ఉత్సవాన్ని దేవరాత్రిగా కొనియాడారు. రాత్రి వెండి అంబారీ వాహనంపై స్వామి, అమ్మవార్లు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

వేదోక్తంగా సంకల్ప పూజ

ముందు ధ్వజారోహణం చేసే కొడి దారాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కలశ స్థాపనతో వేదోక్తంగా సంకల్ప పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం, పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభానికి దర్బధారణ చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య భక్తులు సమర్పించిన కొడి చీరలను దవళ పతాకంతో కలిపి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజ స్తంభానికి అధిరోహింపజేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

రెండవ తిరునాళ్లు–భూతరాత్రి (మాఘ బహుళ దశమి)

వాహన సేవలు

ఉదయం 9గంటలకు : సూర్యప్రభ – చప్పర వాహన సేవ

రాత్రి 8గంటలకు భూత – శుక వాహన సేవ

ఉభయదాతలు : శ్రీకాళహస్తి హరిజన సేవా సంఘం తరపున పసల రమణయ్య, గ్రామ పెద్దలు

న్యూస్‌రీల్

గ్రూప్‌–2 పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: తిరుపతిలో ఆదివారం జరగనున్న గ్రూప్‌– 2 పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం పరిశీలించారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, ఇంటర్మీడియెట్ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం గ్రూప్‌–2 పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రూప్‌–2 పరీక్షా కేంద్రానికి దగ్గరగా ఉన్న దుకాణాలు, నెట్ సెంటర్లను మూసివేయాలన్నారు. తిరుపతిలో 13 సెంటర్లలో గ్రూప్‌–2 ఎగ్జామ్స్ జరుగుతాయని, దానికి సంబంధించి డీఎఫ్ ఎంఎంఎఫ్ సెక్యూరిటీ పరంగా ఏర్పాటు చేసామన్నారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, వాచ్‌లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ సంబంధించిన వస్తువులు తీసుకురాకూడదని సూచించారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ హేమంత్, అదనపు ఎస్పీ పరిపాలన రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, సీఐ రామయ్య ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,327 మంది స్వామివారిని దర్శించుకోగా 22,804 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు గ్రూప్‌–2 పరీక్షలు

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలోని 13 కేంద్రాల్లో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ఒక సెషన్, అలాగే మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు 1.30 గంటల ముందే చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

యథావిధిగా పరీక్షలు

జేసీ శుభం బన్సల్ విలేకరులతో మాట్లాడారు. కొన్ని సామాజిక మాధ్యమాల్లో గ్రూప్‌–2 పరీక్షలు వాయిదా అంటూ ప్రచారం జరుగుతోందన్నారు. దాన్ని నమ్మొద్దన్నారు. షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు జరుగుతాయన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు ఆర్డీఓ రామమోహన్ తెలిపారు. ఇబ్బందులుంటే 7032157040 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

నాడు

అన్ని అవయవాలున్న మానవుడే నాకిది కావాలని కొన్ని సందర్భాల్లో గట్టిగా అడగ లేడు. ఇక మూగ జీవాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వాటికి వచ్చే బాధలు, జబ్బులు చెప్పుకోలేక ఎంత నలిగిపోతుంటాయో మాటల్లో చెప్పలేని పరిస్థితి. ఇలాంటి వాటి సంరక్షణే ధ్యేయంగా గత ప్రభుత్వం అడుగులు వేసింది. 108 వాహనాల మాదిరిగా గ్రామీణ పశువైద్య ఆరోగ్య సేవా సంచార వాహనాలను ఏర్పాటు చేసింది. పల్లెలకే వెళ్లి వైద్యం చేసేలా చర్యలు చేపట్టింది. పాడి రైతులకు కొండంత భరోసా కల్పించింది.

నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రజలకు ఏది మంచి జరగకపోయినా పర్వాలేదు.. గత ప్రభుత్వ ఆనవాళ్లు ఉండకూడదని భావిస్తోంది. ఇందులో భాగంగానే పశువైద్య ఆరోగ్య సేవా సంచార వాహనాలను మూలన పడేసింది. మూగ జీవుల ప్రాణాలతో చెలగాట మాడుతూ.. పాడి రైతులను నట్టేట ముంచేస్తోంది.


సూళ్లూరుపేటలో మూలనపడిన పశువైద్య సేవా సంచార వాహనం

జిల్లా సమాచారం

మండలాలు	34
గ్రామ పంచాయతీలు	822
ఆవులు, ఎద్దులు	2,59,775
గేదెలు	2,69,625
మేకలు	7,60,733
గొర్రెలు	2,80,809
పందులు	2,893
కోళ్లు	25,62,840
పశువైద్య సంచార వాహనాలు	14



అంబా.. అని అరిచినా?

నిరుపయోగంగా పశువైద్య ఆరోగ్య సేవా సంచార వాహనం

- 8 నెలలుగా కదలని వాహనాలు
- పాడి రైతులకు తప్పని తిప్పలు

సూళ్లూరుపేట: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో నోరులేని మూగజీవాలైన పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు ఇంటి వద్దనే వైద్యం చేసేందుకు గ్రామీణ పశువైద్య ఆరోగ్య సేవా సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గానికి మూడు మండలాలకు కలిపి ఒక వాహనాన్ని ఏర్పాటు చేశారు. 108 తరహాలో మూగ జీవులకు వైద్యసేవలందించారు. గ్రామాల్లో పశువులకు జబ్బు చేసే 1963 నంబర్‌కి కాల్ చేస్తే నిమిషాల్లో ఆయా గ్రామాలకు వెళ్లి వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. ఈ వాహనం ద్వారా పశువులకు సీజన్‌ల్‌గా వచ్చే వ్యాధులకు టీకాలు వేయడం, ఎమర్జెన్సీగా వచ్చే వ్యాధులకు సకాలంలో చికిత్సలు అందించడం లాంటి వైద్యసేవలందించేవారు. 2014–19 మధ్య కాలంలో గోపాలమిత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో జగనన్న ప్రభుత్వం పశువుల వైద్యానికి అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి మెరుగైన సేవలందించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలలకే వాటిని మూలన పడేశారు. మూగ జీవుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

1963 'మూగ'నోము!

కూటమి ప్రభుత్వ వచ్చాక పశువైద్య సంచార వాహనాలను గాలికి వదిలేశారు. ఆపదొచ్చినప్పుడు 1963కు కాల్ చేస్తే సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. డాక్టర్లు లేరని, కాంపౌండర్లు లేరని, డ్రైవర్లు లేరని చెప్పుకొస్తున్నారు. వాహనాలను సైతం ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వ ఆనవాళ్లు కనిపించకుండా ఉండాలనే దురుద్దేశంతో మంచి పథకాలను సైతం పక్కకు నెట్టేశారు. నోరులేని మూగజీవాల మీద కూడా కక్ష తీర్చుకుంటూ వాటి ప్రాణాలు తీస్తున్నారు.

పశువైద్యంపై నిర్లక్ష్యం



గత ప్రభుత్వం పశువైద్య సంచార వాహనాలను ఏర్పాటు చేస్తే వాటిని నీరు గార్చే విధంగా ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారు. మాకు గేదెలు, ఆవులు, ఎద్దులు ఉన్నాయి. పశువులకు వ్యాధులు సోకితే 1963 కాల్ చేస్తే ఇంటి వద్దకే వచ్చి వైద్యం చేసి మందులు ఉచితంగా అందజేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పశువైద్య సంచార వాహనాన్ని 8 నెలలుగా ఆపేసి ఉన్నారు. మూగజీవాలు రోగాల బారినపడితే పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

– బీ.అనీల్‌కుమార్, వెంకటరెడ్డిపాళెం

వైద్యం అందడం లేదు



అనవసరంగా పశుసంచార వాహనాలను రద్దు చేశారు. మారుమూల గ్రామానికి పశువులకు వైద్యం అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పశువైద్యానికి ఢోకా లేకుండా ఉండేది. ఎప్పటికప్పుడు పశువులకు వైద్య పరీక్షలతో పాటు సీజనల్‌గా వచ్చే వ్యాధులకు టీకాలు వంటివి వేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పశువులకు జబ్బు చేస్తే మండల కేంద్రాలకు తీసుకెళ్లి చూపించుకోవాల్సి వస్తోంది.

– ఎస్.మునస్వామి, వెదురుపట్టు గ్రామం, దొరవారిసత్రం మండలం

ఆ వాహనాలను ఆపేయమన్నారు



పశువైద్య సంచార వాహనాలను ప్రభుత్వం ఆపేయమంది. గడిచిన రెండు రోజుల కిందటే జీఓ కూడా విడుదల చేశారు. అందుకని వాహనాలను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పజెబుతాం. సూళ్లూరుపేటలో ఉన్న వాహనం మాత్రం 8 నెలలుగా డ్రైవర్ లేకపోవడంతో ఆపేసి ఉన్నాం. వైద్యశాలల్లోనే పశువులకు వైద్యం చేయించుకోవాలి.

– వరలక్ష్మి, పశుసంవర్ధకశాఖ ఏడీ, సూళ్లూరుపేట

యువోత్సాహం

- మిన్నంటిన ఐఐటీ తిరుత్సవ–2025 సంబరాలు
- ఉర్రూతలూగించిన ప్రఖ్యాత డీజే ఆర్టిస్ట్ డీజే రుహాన్ ప్రదర్శన
- నేటితో ముగియనున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్


విద్యార్థుల క్విజ్, ఆటల పోటీలు


సాంస్కృతిక కార్యక్రమాలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

రేణిగుంట(ఏర్పేడు): తిరుత్సవ పేరిట ఐఐటీలో ప్రతియేటా నిర్వహించే సాంస్కృతిక సంబరాలు ఈ ఏడాది కూడా యువోత్సాహంతో మిన్నంటాయి. ఏర్పేడు సమీపంలోని ఐఐటీ ప్రాంగణంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ పర్యవేక్షణలో విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో తిరుత్సవ సంబరాలు సాగుతున్నాయి. శనివారం ఉదయం విద్యార్థుల బృందం మర్డర్ మిస్టరీని ఛేదించేందుకు మెదడుకు పదును పెట్టారు. ఎస్కేప్ రూమ్, కౌన్ బనేగా కరోడ్‌పతి, స్క్వాడ్ గేమ్స్, ఫ్యాషన్ షో ప్రదర్శనలు సాయి. సాయంత్రం విద్యార్థుల బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకుంది.

నేటితో ముగియనున్న సంబరాలు

తిరుత్సవ –2025 సంబరాల్లో చివరి రోజు ఆదివారం ట్రెషర్ హంట్, టెక్ హీస్ట్ ఫైనల్స్, పాప్ కల్చరల్ క్విజ్, క్రికెట్–ఓ మ్యానియా, రాత్రి సినీ సింగర్ హరిచరణ్, శిరీష బృందం ప్రదర్శలతో ముగియనున్నాయి.

కట్టిపడేసిన డీజే ప్రదర్శన

రాత్రి డీజేర్టిస్ట్ డీజే రుహాన్ ప్రదర్శన ఆద్యంతం వీక్షకులను కట్టిపడేసింది. హుషారైన పాప్ గీతాలతో ఆమె చేసిన డీజే నృత్యాలతో ఐఐటీ ప్రాంగణం హోరెత్తింది. ఐఐటీ విద్యార్థులే కాకుండా బయట నుంచి వచ్చిన వారు నృత్యాలు చేస్తూ కేరింతలతో ఈవెంట్‌ను ఆస్వాదించారు.


కెవ్వుకేక


డీజే ఆర్టిస్ట్ రుహాన్ ప్రదర్శనకు విద్యార్థుల కేరింతలు


సెల్ఫీ దిగుతున్న సినీనటుడు అవసరాల శ్రీనివాస్

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్

శ్రీకాళహస్తి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని జిల్లా విద్యాశాఖధికారి కేవీఎన్.కుమార్ స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి సరస్వతి బాయ్ పురపాలక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న గైడ్ కెప్టెన్ ట్రైనింగ్ క్యాంపును ఆయన శనివారం సందర్శించారు. అనంతరం స్కౌట్స్ ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్ బేడన్ పావెల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. లీడర్ ట్రైనర్ శకుంతలమ్మ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. కుప్పిరెడ్డి, అసిస్టెంట్ ట్రైనర్ ధనలక్ష్మి, ఎంఈఓ భువనేశ్వరి, కార్యాలయ కమిషనర్ టీ.రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి ఎం.జయరామ, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఎస్. కోటేశ్వరరావు, డీఓసీ సతీసావిత్రి, స్కౌట్ మాస్టర్ హేమకుమార్, యూత్ చైర్మన్ అజారుద్దీన్, ఏఎంఓ శివశంకరయ్య, స్కౌట్ మాస్టర్లు యోగానందం, సుబ్రహ్మణ్యం, మహేంద్ర, మణికంఠ పాల్గొన్నారు.

డీడీఈ పరీక్షలు మళ్లీ వాయిదా

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న డీడీఈ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి శనివారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 24 నుంచి మార్చి 15వతేదీ వరకు జరగనున్న దూరవిద్యకు సంబంధించిన యూజీ, పీజీ పరీక్షలను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మహాశివరాత్రికి 436 సర్వీసులు


నరసింహులు, డీపీటీఓ

తిరుపతి అర్బన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జిల్లాలోని పలు డిపోల నుంచి 436 ఆర్టీసీ సర్వీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు డీపీటీఓ నరసింహులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 25న 87 సర్వీసులు, 26న 209, 27న 140 సర్వీసులు నడపనున్నట్టు చెప్పారు. శ్రీకాళహస్తి, తలకోన, సదాశివకోన, కైలాసకోన, అవంతి, ఊతుకోట, గాజులమండ్యం, మూలకోన, యాకసిరితిప్ప ప్రాంతాలకు సర్వీసులు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. తిరుపతి డిపో నుంచి 110 సర్వీసులు, మంగళం డిపో నుంచి 7, శ్రీకాళహస్తి డిపో నుంచి 155, పుత్తూరు డిపో నుంచి 116, సత్యవేడు డిపో నుంచి 25, వాకాడు నుంచి 17, గూడూరు డిపో నుంచి 6 బస్సులు మహాశివరాత్రికి కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉంటాయన్నారు.

కనుల నిండుగా..కవలల పండుగ!

- ఒకే వేదికపై 100 మంది కవలలు
- ఘనంగా అంతర్జాతీయ కవలల దినోత్సవం


కేక్ తినిపించుకుంటూ.. శుభాకాంక్షలు తెలియజేస్తూ..

తిరుపతి సిటీ: అమ్మ గీసిన అచ్చు బొమ్మలు తిరుపతి నగరంలో హల్‌చల్ చేశారు. అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్విన్స్ మీట్–2025 కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి సుమారు 100మంది కవలలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్‌చేసి ఒకరినొకరు ట్విన్స్ డే శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం సాంస్కృత కార్యక్రమాలలో మునిగితేలారు. నిర్వాహకులు హేమావతి, హేమలత ట్విన్స్ మాట్లాడుతూ ప్రతి ఏడాదీ తిరుపతిలో అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది పలు రాష్ట్రాలలో ఉద్యోగాలు చేస్తున్న తెలుగు యువ కవలలు, చిన్నారులు వారి తల్లుదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరవడం సంతోషంగా ఉందన్నారు. తొలిసారిగా ట్విన్స్ గ్రూప్‌ను తాము క్రియేట్ చేయడంలో స్వల్ప కాలంలోనే అందరూ ట్విన్స్ గ్రూప్‌లో కలిశామని, దీంతో కవలల దినోత్సవాన్ని నిర్వహించేందుకు సిద్ధమయ్యామని తెలిపారు.


ట్విన్స్‌డేకి హాజరైన కవలలు

క్లుప్తంగా

ఆర్టీఏ నిబంధనలు తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీటీఓ కొర్రపాటి మురళీమోహన్

తిరుపతి మంగళం: ప్రతి వాహనదారుడు రవాణాశాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణాశాఖాధికారి(డీటీఓ) కొర్రపాటి మురళీమోహన్ స్పష్టం చేశారు. మంగళంలోని తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని డ్రైవింగ్ ట్రాక్‌లో సెన్సార్ విధివిధానాలపై శనివారం డ్రైవింగ్ టెస్టుకు వచ్చిన వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. డ్రైవింగ్ ట్రాక్‌లోకి వాహనదారులను తీసుకెళ్లి డ్రైవింగ్ చేసేటప్పుడు సెన్సార్ వద్ద వాహనదారులు అనుసరించాల్సిన విధానాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ పరిపూర్ణంగా డ్రైవింగ్ నేర్చుకున్నాకే టెస్టుకు హాజరుకావాలన్నారు. ఎంవీఐలు అధికానాజ్, స్వర్ణలత పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

తిరుపతి లీగల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెస్తున్న న్యాయవాదుల సవరణ బిల్లు 2025ను వ్యతిరేకిస్తూ తిరుపతి న్యాయవాదులు ఈనెల 24, 25 తేదీలలో విధులకు హాజరు కాకూడదని తిరుపతి న్యాయవాద సంఘ కార్యవర్గ సభ్యులు శనివారం తీర్మానించినట్టు తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా న్యాయవాదుల హక్కులు హరించే విధంగా న్యాయవాద చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్



వడమాలపేట పంచాయతీలో చెత్తసేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సుశీలాదేవి

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా 774 పంచాయతీల్లో చెత్త సేకరణకు శని, ఆదివారాలు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి వెల్లడించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఇంటి వద్దకు వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలనే ఉద్దేశంతో 22, 23 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్టు చెప్పారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రూ.7,20,000కు వర్మి కంపోస్ట్‌తోపాటు పొడి చెత్తను విక్రయించామని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శనివారం వడమాలపేట, గాజులమండ్యం, రేణిగుంట, పాకాల, డక్కిలి, ఏర్పేడు పంచాయతీల్లో చెత్తసేకరణ కార్యక్రమాలను పరిశీలించినట్లు వివరించారు.

వేశ్య గృహంపై దాడులు

తిరుపతి క్రైమ్: నగరంలోని అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వేశ్య గృహం నడుపుతున్న ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రమిట్టలో నివాసముంటున్న లక్ష్మి తన ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చింది. తమ సిబ్బందితో దాడి చేయగా విటురాలని, విటుడుని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

గరుడ వాహనా గోవిందా!

- మోహినీ అవతారంలో శ్రీనివాసుడు విహారం
- కిక్కిరిసిన మాడ వీధులు



శ్రీనివాసమంగాపురానికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు



గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీవారు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉదయం పల్లకీపై మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు దివ్య మోహినీ రూపంలో ఉత్సవ మూర్తి, తిరుచ్చిపై చిన్ని కృష్ణుడు తన కృపాకటాక్షాలతో భక్తులను అనుగ్రహించారు. భక్తుల కోలాటాలు, చెక్క భజనలు, కేరళ వాయిద్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ నాలుగు మాడ వీధుల్లో గోవింద నామస్మరణలో మంగాపురం మార్మోగింది. టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య, జేఈఓ వీరబ్రహ్మం గరుడ వాహన సేవలో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు గరుడ వాహనం సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

మంగాపురంలో పటిష్ట భద్రత

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరుడ వాహనం సందర్భంగా శ్రీనివాస మంగాపురంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారి మాలల ఊరేగింపు

తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలోని ఆండాళ్(గోదాదేవి) అమ్మవారి ఆలయం నుంచి స్వామి వారికి ప్రత్యేకంగా తయారు చేయించిన పూల మాలలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. రాత్రి జరిగిన గరుడ సేవలో శ్రీవారికి ఈ మాలలను అలంకరించారు. పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓలు వరలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

నేడు స్వర్ణరథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం స్వర్ణరథోత్సవం వైభవంగా జరగనుంది. రాత్రి 7 గంటలకు గజ వాహనంపై స్వామి, అమ్మవార్లు విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

ఆధ్యాత్మిక పాదయాత్రకు అపూర్వ ఆదరణ

తిరుపతి రూరల్, చంద్రగిరి: తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి ప్రతి ఏటా జరిగే గరుడ సేవకు పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. సారె తీసుకు వెళ్లేందుకు నిర్వహించిన ఆధ్యాత్మిక మహా పాదయాత్రకు అడుగడుగునా అపూర్వ ఆదరణ లభించింది. శనివారం ఉదయం తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న ఆలయం నుంచి బయలుదేరిన ఆధ్యాత్మిక పాదయాత్ర పేరూరు, తాటితోపు, చెర్లోపల్లి, పుదిపట్ల, గాంధీపురం, పెరుమాళ్లపల్లి, సి.మల్లవరం, కాలూరు క్రాస్ మీదుగా మధ్యాహ్నం 2గంటలకు శ్రీనివాసమంగాపురానికి చేరుకుంది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆధ్యాత్మిక పాదయాత్రలో కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిరంతరాయంగా ఆడుతూ పాడుతూ పాదయాత్రలో భక్తితత్వాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా కళాకారులను చెవిరెడ్డి అభినందించారు.

వైభవంగా శ్రీవారి లక్ష్మీహారం శోభాయాత్ర

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన గరుడ వాహన సేవకు తిరుమల శ్రీవారి లక్ష్మీహారాన్ని తిరుపతి పరిపాలనా భవనం నుంచి శోభాయాత్రగా తీసుకొచ్చి అలంకరించారు. అంతకుముందు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి ఆలయ పేష్కర్ శ్రీహరి లక్ష్మీహారాన్ని తిరుపతి పరిపాలన భవనానికి తీసుకొచ్చారు. అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్లుగా పట్టువస్త్రాల సమర్పణ

గత పాతికేళ్లుగా శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో గరుడ వాహన సేవకు చెవిరెడ్డి పాదయాత్రగా వెళ్లి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నారు. ఎప్పటిలాగే స్వామి వారికి పట్టు వస్త్రాలు, శేషమాలలను పల్లెల్లో ఊరేగించారు. భక్తితత్వాన్ని పెంచడానికి ఆయా పల్లెల్లోని గ్రామ పెద్దలకు సారెను అందజేసి వారి ద్వారా గ్రామ పొలిమేర్లు దాటిస్తూ ముందుకు సాగారు. చెవిరెడ్డితో పాటు ఆయన భార్య చెవిరెడ్డి లక్ష్మి, కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వెంటనడిచారు. ప్రతి పల్లెలో ప్రజలు స్వచ్ఛందంగా మజ్జిగ, తాగునీరు, కొబ్బరినీళ్లు, పుచ్చకాయ వంటివి పంపిణీ చేశారు.



చెర్లోపల్లిలో సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



శ్రీనివాసమంగాపురం మాడ వీధుల్లో లక్ష్మీహారం ఊరేగింపు



సూపరింటెండెంట్ రమేష్‌కు పట్టు వస్త్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

ఏసీలో చెలరేగిన మంటలు



ఐదో అంతస్తులో చెలరేగుతున్న మంటలు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలోని భవానీ నగర్ సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లోని ఏసీలో నుంచి మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారుల కథనం.. భవానీ నగర్ సమీపంలోని శ్రీనివాస తేజ రెసిడెన్సీలోని 5వ అంతస్తులోని ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఏసీలో మంటలు చెలరేగాయి. సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేశారు. ఐదో ఫ్లోర్‌లో నివాసముంటున్న లియాకాతాళి ప్లాట్లో వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సుమారు 20 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. కింద ఫ్లోర్‌కు మంటలు చెలరేగకుండా రెండు ఫైర్ ఇంజిన్లు ఉపయోగించి రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మార్చి 1 నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలను జిల్లాలోని 86 పరీక్షా కేంద్రాల్లో పటిష్టంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై సీఎస్, డీఓ, కస్టోడియన్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ మార్చి 1న ప్రథమ సంవత్సర, 3న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 63,263 మంది హాజరు కానున్నట్టు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ చేతివాటం

- తాకట్టుకొచ్చిన ఐదున్నర కేజీల బంగారం మాయం
- నాగలాపురం యూనియన్ బ్యాంక్‌లో తంతు
- బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్‌పై కేసు



నాగలాపురంలోని యూనియన్ బ్యాంక్

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.సూర్యతేజ ఏకంగా బ్యాంక్‌కు తాకట్టుకు వచ్చిన ఐదున్నర కేజీల బంగారాన్ని పక్కదారి పట్టించారు. ఈ బంగారానికి సంబంధించి 67 మంది ఖాతాదారులు రూ.2.35కోట్ల మేరకు రుణాలు పొంది ఉన్నారు. అయితే 67 ప్యాకెట్ల ద్వారా ఐదున్నర కేజీల బంగారాన్ని బ్యాంకు లాకర్‌లో భద్రపరచగా అసిస్టెంట్ మేనేజర్ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఐదు కేజీల బంగారాన్ని బయటకు తరలించాడు. రూ.12 లక్షల విలువ చేసే 300 గ్రాముల బంగారంపై అదే బ్యాంకులో రొటేషన్ పద్ధతిలో 11 మంది తన అనుచరుల ద్వారా రూ.1.35 కోట్లు అక్రమంగా రుణాలు పొంది తన వశం చేసుకున్నాడు. బయటకు తరలించిన 5 కేజీల బంగారంపై ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టి భారీ మొత్తంలో రుణాలు పొందినట్లు సమాచారం. ఈ అక్రమ తంతు ఈ నెల 10న జరిగిన ఆడిట్‌లో బహిర్గతమైంది. దీనిపై యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఏ. సూర్యతేజ, మేనేజర్ శేఖర్ తిరైవరాజుపై కేసు నమోదు చేసినట్లు సత్యవేడు సీఐ మురళి తెలిపారు. దర్యాప్తులో పూర్తిస్థాయి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే వారిద్దరినీ విధుల నుంచి సస్పెండ్ చేయడం జరిగింది.

బాలికపై లైంగిక వేధింపులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గాజుల మండ్యం సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన కుటుంబం నివాసముంటోంది. ఆ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలికను ఎర్రమరెడ్డిపాళెంకు చెందిన పవన్ (35) లైంగిక వేధింపులకు గురిచేయడంతో బాధితురాలు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని డ్రైవర్ మృతి



మృతి చెందిన ఖలీల్‌బాషా

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో దొడ్లవారిమిట్ట గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతున్న ఖలీల్ బాషా(36)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నాయుడుపేట మండలం, మలయకోట ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ ఖలీల్‌బాషా శుక్రవారం ఓ లారీని తీసుకెళ్లి రేణిగుంటలో వదిలి మరో లారీలో నాయుడుపేటకు వస్తున్నాడు. చీకటిలో మార్గ మధ్యంలో దొడ్లవామిట్ట వద్ద లారీ దిగాడు. అక్కడి నుంచి రోడ్డు మీద నడుచుకుంటూ నాయుడుపేటకు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఖలీల్ బాషాకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్రమశిక్షణతో ఎదగాలి



దివంగత సీనియర్ న్యాయవాది శ్రీధర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తిరుపతి లీగల్: యువ న్యాయవాదులు క్రమశిక్షణతో ఉన్నప్పుడే వృత్తిలో రాణించగలరని రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యూ.దుర్గాప్రసాద్‌రావు తెలిపారు. శనివారం తిరుపతి తుడా కార్యాలయం సమీపంలోని కచ్చపి ఆడిటోరియంలో సీనియర్ న్యాయవాది, దివంగత కేఎస్.శ్రీధర్ విగ్రహావిష్కరణ, ఆయన జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ హైకోర్టు జడ్జి దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ తాను మొదటిగా తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జిగా వృత్తిని ప్రారంభించానని తెలిపారు. ఇక్కడ పలు సీనియర్ న్యాయవాదుల వద్ద చట్టాలపై, వృత్తిలో చాలా మెలకువలు నేర్చుకున్నట్టు గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్ రావు మాట్లాడుతూ దివంగత సీనియర్ న్యాయవాది కేఎస్ శ్రీధర్ న్యాయవాదిగా, విద్యాదాతగా, ఆధ్యాత్మిక వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్, శతావధాని మేడసాని మోహన్, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, సీనియర్ న్యాయవాది దొరైరాజ్ పాల్గొని ప్రసంగించారు. న్యాయవాది కేఎస్ వాసు తిరుపతిలో 50 సంవత్సరాలు పైబడి న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు ఇతరులు దివంగత శ్రీధర్ విగ్రహావిష్కరణ, ఆయన జీవిత చరిత్ర పుస్తకావిష్కరణలు చేసి శ్రీధర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో దివంగత కేఎస్ శ్రీధర్ కుటుంబ సభ్యులు, పలువురు న్యాయవాదులు, పాల్గొన్నారు.